www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 26 ఆగస్టు 2025

వినతుల వెల్లువ

- కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులు
- వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు : జాయింట్ కలెక్టర్
- పిజిఆర్‌ఎస్‌కు 359 వినతులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని జాయింట్ కలెక్టర్ జి.విద్యాదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన 359 అర్జీలను జాయింట్ కలెక్టర్ జి.విద్యాదరి స్వీకరించారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడేల్, డిఆర్ఓ కె.మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ కుసుమ కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీదారు సంతృప్తి చెందేలా వేగంగా పరిష్కరించినప్పుడే అధికారులపైవిశ్వాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తంగా 359 అర్జీలు అందగా అందులో శాఖల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ, సర్వే శాఖకు సంబంధించి 258, పోలీసు శాఖ 8, పంచాయతీరాజ్ 5, విద్యాశాఖ 7, ఐసిడిఎస్ 4, వ్యవసాయశాఖ 6, పౌర సరఫరాల శాఖ 4, డిఆర్‌డిఏ 18, విభిన్న ప్రతిభావంతుల శాఖ 3, డిసిహెచ్ఎస్ 10, డిఎం అండ్ హెచ్ ఒ 8, ఉద్యానశాఖ 3, పశుసంవర్థక శాఖ 3, స్టాంపులు, రిజిస్ట్రేషన్ 1, ఎల్డిఎం 1, ఎపీఎస్ ఆర్టీసీ 1, ఇరిగేషన్ 5, సైనిక్ సంక్షేమశాఖ 3, విద్యుత్ శాఖ 3, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 2, గురుకులం 2, గ్రామీణ నీటి సరఫరాశాఖ 3, గృహనిర్మాణ సంస్థ 1.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

పరిష్కారంలో అలసత్వం చేయకండి

చిత్తూరు అర్బన్: సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి 32 ఫిర్యాదులను అడిషనల్ ఎస్పీ రాజశేఖర్‌రాజు స్వీకరించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం లేకుండా, వాటిని సమర్థవంతంగా పరిష్కరించాలని అడిషనల్ ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులు ఫిర్యాదులకు స్పందిస్తూ బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్, సెల్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఫిర్యాదులన్నింటిపై చట్టపరమైన విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా సమస్యలు పరిష్కరించాలంటూ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మొత్తం 32 ఫిర్యాదులు అందాయి, వాటి వివరాలు కుటుంబ తగాదాలు 6, వేధింపుల 3, ఇంటి తగాదాలు 4, భూ తగాదాలు 12, డబ్బు తగాదాలు 5, దారి తగాదాలు 2 ఉన్నాయి.

అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు

వినతులు స్వీకరించిన కమిషనర్

చిత్తూరుఅర్బన్: నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 13 వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కమిషనర్ అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు. క్షేత్రస్థాయి విచారణ చేసి సత్వరం పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో అందే ప్రతి ఫిర్యాదుపై తప్పనిసరిగా క్షేత్రస్థాయి విచారణ చేసి నివేదిక సమర్పించాలన్నారు. గతవారం అందిన వినతులపై సమీక్షించారు. ఈకార్యక్రమంలో పింఛన్లు 9, ఇంజనీరింగ్ 3, పబ్లిక్ హెల్త్ 1 చొప్పున మొత్తం 13 వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకట రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న నగర కమిషనర్

కుప్పంలో రెండు పారిశ్రామిక పార్కులు

8వేల మందికి ఉపాధి : కడ పీడీ

ప్రజాశక్తి- కుప్పం: గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పరిశ్రమలకు కావలసిన అన్ని మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర వాణిజ్య శాఖ, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ పేర్కొన్నారు. సోమవారం కడ కార్యాలయంలో కుప్పం నియోజకవర్గంలో వివిధ పారిశ్రామిక పార్కులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, కడ పీడీ వికాస్ మరమ్మత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ కార్యదర్శి మాట్లాడుతూ కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద కుప్పంలో పారిశ్రామిక యూనిట్లను స్థాపించడానికి రెండు కంపెనీలకు భూమి కేటాయించడం జరిగిందని, అందుకు కావాల్సిన మౌలిక వసతులన్నీ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒక పాల ఉత్పత్తి, పశుగ్రాస ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయగా, మదర్ డెయిరీ, ఒక పండ్ల గుజ్జు ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణాంధ్ర విజన్‌కు అనుగుణంగా ఉన్న ఈ కార్యక్రమాలు పేదరికాన్ని నిర్మూలించడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో రెండు పారిశ్రామిక పార్కులకు ఆమోదం లభించడం జరిగిందని తెలిపారు. ఈ రెండు పార్కులు వల్ల కుప్పం ప్రజల ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. ఈ రెండు పారిశ్రామిక పార్కులకు అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చేపడుతున్నాడని తెలిపారు. కడ పీడీ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులు ద్వారా 8,000 ఉద్యోగాలను సృష్టిస్తాయని, స్థానిక యువతకు ఉపాధికి పెద్ద ఉపాధి దొరుకుతుందని ప్రోత్సాహాన్ని అందిస్తాయని తెలిపారు. ఆర్‌డిఓ శ్రీనివాసరాజు, ఇండస్ట్రీ జిఎం సూరిబాబు, ఏపీఐఐసీ జెడ్ఎంపాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న యువరాజ్

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- కుప్పం: సీఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గ పర్యటన ఏర్పాట్లను సోమవారం చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. కుప్పం మండలం పరమసముద్రం సమీపంలో హంద్రీనీవా కాలువ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈనెల 30వ తేదీన సీఎం చంద్రబాబు దంపతులు పరమ సముద్రం సమీపంలో హంద్రీనీవా కాలువకు జలహారతి ఇచ్చి కృష్ణ జలాలను కుప్పంకు విడుదల చేయనున్నారు. దీంతో సీఎం పర్యటించే ప్రాంతాలను సోమవారం కలెక్టర్, ఎస్పీ పరిశీలించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సీఎం పర్యటనకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రధానంగా హంద్రీనీవా కాలువ వద్ద సీఎం జల హారతికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. కృష్ణా జలాలకు జలహారతి అనంతరం జరిగే బహిరంగ సభ ప్రాంగణాన్ని కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ శంకరయ్య, రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు జిమ్ దాము, జాకీర్, గణపతి, అధికారులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఆక్రమణలను అడ్డుకున్న స్థానికులు

కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం ప్రశాంత్‌నగర్‌లో ప్రభుత్వ ఆసుపత్రి పక్కన 40 అడుగుల రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కూడా ఇదే విధంగా ఆక్రమణ గురైతే స్థానికులు అడ్డుకొని ఫిర్యాదు చేయగా అధికారులు స్థలాన్ని పరిశీలించి ఇది ప్రభుత్వ స్థలమని బోర్డు పెట్టడం జరిగిందని, కొన్ని రోజుల తర్వాత బోర్డును తొలగించి ఇప్పుడు మళ్లీ రోడ్డున ఆక్రమించే పనిచేస్తున్నారని తెలిపారు. సోమవారం స్థానిక సిపిఎం నాయకురాలు చిట్టెమ్మ ఆధ్వర్యంలో స్థానికులు అడ్డుకోవడం జరిగిందని అయినా ఆక్రమణదారులు లెక్కచేయకుండా తమకు పట్టా ఉందని బెదిరింపులకు పాల్పడుతున్నారని, జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సిపిఎం ఇచ్చిన ఫిర్యాదుతో చిత్తూరు ఆర్డీవోని పిలిచి వెంటనే సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఆర్‌డిఓ, రెవెన్యూ ఇన్స్పెక్టర్లను పంపి రిపోర్టు పెట్టాలని తెలిపారు. రోడ్డు స్థలానికి రెవెన్యూ అధికారులు పట్టాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రశాంత్‌నగర్లో ఆక్రమణలను ఆపకపోతే స్థానికులతో కలిసి పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

సిపిఎం ఆధ్వర్యంలో ఆక్రమణను అడ్డుకుంటున్న ప్రశాంత్ నగర్ ప్రజలు

ఈ రోడ్డు నరకానికి బోర్డు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు
- బురదలోనే పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

గుంతల్లో నీరు నిల్వ చేరి ఇబ్బందికరంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి- విజయపురం

మండలంలోని ఎల్లసముద్రం ఎస్టీ కాలనీ వీధుల్లో వర్షాలు పడితే చాలు వీధులు బురదమయం కావడంతో ప్రయాణం నరకంలా ఉందని పాదచారులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డు వేయకపోవడమే ప్రధాన కారణమని గ్రామస్తులు వాపోతున్నారు. రోడ్డు వేయకపోవడం గుంతలమైన రోడ్డుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ఎల్లసముద్రం ఎస్టీ కాలనీలో వర్షపు నీరు చుట్టుముట్టి వీధులన్నీ బురదమయంగా మారాయి. చినుకు పడితే చాలు ఈ వీధి దారుణంగా తయారవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీవాసులు తమ నివాసాలకు వెళ్ళటానికి వీలులేని పరిస్థితి నెలకొంది. ఇక రోజు విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే ఈ బురద దారిలోనే వెళ్లాల్సిన దుస్థితి. రాత్రి వేళల్లో వీధిలో వెళ్లాలంటే ప్రజలు సాహసం చేయడమనే చెప్పాలి. కూటమి ప్రభుత్వం సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి కోట్లాది రూపాయల నిధులు విడుదల చేసినప్పటికీ ఈ గ్రామానికి నోచుకోలేదు. గ్రామాల అభివృద్దే కూటమి ధ్యేయమని పాలకులు గొప్పలు చెప్పుకున్నా ఈ గ్రామంలో వాటికి భిన్నంగా కనిపిస్తుంది. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎల్లసముద్రం ఎస్టీ కాలనీ వీధులను సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని, తమ ఇబ్బందులకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

బురదతో అధ్వానంగా ఉన్న రోడ్డు

రోడ్డు పక్కన చెత్త.. ఇలా చేస్తే ఎలా..

ప్రజాశక్తి- విజయపురం: మండలంలోని సామిరెడ్డికండ్రిక పంచాయతీలో రోడ్డు పక్కన చెత్తకుప్పలు పేరుకుపోయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, సేకరించిన చెత్తతో ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంగా సంపద తయారీ షెడ్లను గత ప్రభుత్వం నిర్మించింది. కానీ ప్రస్తుతం తరలిస్తున్న చెత్తను కుప్పలుగా పోస్తూ కాలుస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను కుప్పలుగా పోయడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన రావడంతోపాటు పర్యావరణ కాలుష్యం ఏర్పడుతోంది. చెత్త సేకరణతోనే సరిపెట్టగా వాటిని వేరుచేసే పరిస్థితి లేదు. మండలంలో 12 పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లను రూ.లక్షలు వెచ్చించి నిర్మించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను ఇక్కడికి చేర్చి తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేసి స్వయం సమృద్ధి సాధించాలి. కానీ అదెక్కడా అమలు కావడం లేదు. రోడ్డు పక్కన పడేసి కాల్చివేస్తున్నారు. మరికొన్ని చోట్ల అలాగే వదిలేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి పొడి చెత్త, తడి చెత్తను షెడ్డులకు తరలించాలని, రోడ్డు పక్కన పేరుకుపోతున్న చెత్తను వెంటనే శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

యోగా రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు ద్వితీయ ర్యాంకు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

యోగా సనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలో గల శ్రీ సరస్వతి విద్యా మందిర్‌లో ఈ నెల 21 నుండి 24వ తేదీ వరకు జరిగిన 6వ రాష్ట్ర స్థాయి యోగాసనా పోటీలలో చిత్తూరు చెందిన వి.రేఖ సీనియర్ మహిళా విభాగంలో ద్వితీయ స్థానంతో వెండి పథకాన్ని కైవసం చేసుకుందని 'యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ చిత్తూరు' ప్రధాన కార్యదర్శి యుక్తా చౌదరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు 20 జిల్లాలు పాల్గొన్న ఈ పోటీలో ద్వితీయ స్థానం సాధించడం జిల్లాకు గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా అనేక మంది యోగా ప్రముఖులు ఆమెను అభినందించారు. విజేత రేఖ మాట్లాడుతూ మరింత సాధనతో భవిష్యత్‌లో మరిన్ని మెడల్ సాధిస్తానని తెలిపారు.

యోగాసనా పోటీల్లో ద్వితీయ ర్యాంకు సాధించిన రేఖ

మహిళలకు ఐరన్ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి సమక్షంలో వైద్య ఆరోగ్యశాఖ స్టేట్ కమిషనర్ వారి ఆదేశాల మేరకు కలెక్టరేట్లో ఆఫీస్‌లో పని పనిచేస్తున్న మహిళలకు వారానికి ఒక్కరోజు ఐరన్ మాత్రలు ప్రత్యక్షంగా మింగించాలని ఆదేశించారు. తద్వారా రక్తహీనత లేని సమాజ స్థాపనకు నాంది పంపుదామని, వ్యాధి నిరోధకత పెరుగుదలతో అంటువ్యాధులు దరిచేరకుండా కాపాడుకోవచ్చని స్త్రీలు అందరూ ఆరోగ్యంగా ఉందామని తెలియజేస్తూ సోమవారం జిల్లా సచివాలయ కార్యాలయంలో అందరికీ ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ పతాంజలి, డిపిఎంఓ డాక్టర్ ప్రవీణ, రాజేశ్వరి, రామ్మోహన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

పార్టీ కోసం శ్రమించిన వారందరికీ అవకాశాలు..

ఆర్ అండ్‌బి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్

తెలుగుదేశం పార్టీ శాశ్వతంగా అధికారంలో ఉండేలా పార్టీని సంస్థాగతంగా బలంగా తయారు చేయాలనే లక్ష్యంతో పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించాలని అధిష్టానం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారని ఆర్ అండ్ బి మంత్రి, జిల్లా అధ్యక్ష ఎన్నికల పరిశీలకులు బీసీ జనార్ధన్ రెడ్డి చెప్పారు. సోమవారం చిత్తూరులోని భాస్కర హోటల్లో చిత్తూరు టిడిపి పార్లమెంటరీ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించి నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ జిల్లా పార్టీ కమిటీతో పాటు, ఇతర అనుబంధ కమిటీలు ఎన్నికలు స్వచ్ఛతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతాయన్నారు. ఎన్నికల్లో కష్టపడ్డ వారందరికీ పదవుల ఆశించే హక్కు ఉందని, అయితే సామాజిక సమీకరణలు, సర్దుబాట్లు, అన్ని కులాల వారికి సమాన ప్రాతినిధ్యం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. అధిష్టానం నిర్ణయం ప్రకారం అందరూ కలిసికట్టుగా సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లా ఎన్నికల కమిటీ పరిశీలకులు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావులు మాట్లాడారు. సంస్థాగత ఎన్నికల్లో కార్యకర్తలు ఇచ్చిన అభిప్రాయాలు అధిష్టానం ముందు ఉంచుతామన్నారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, ప్రభుత్వ విప్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీమోహన్ మాట్లాడారు. చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు సిఆర్.రాజన్, డిసిసిబి చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ ఎస్ అముద పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సర్టిఫికేట్స్ వెరిఫికేషన్ పూర్తి : ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఎపిఎస్పీ కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికేట్ వెరిఫికేషన్ ప్రశాంతంగా పూర్తి చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. మొత్తం 310 మందికి గాను 296 మంది సర్టిఫికేట్ వెరిఫికేషన్ కొరకు హాజరయ్యారు. రాష్ట్ర పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు వారు కానిస్టేబుల్ ఉద్యోగానికి నిర్వహించిన వివిధ పరీక్షలల్లో ఉత్తీర్ణత పొంది ఉద్యోగాన్ని సాధించిన అభ్యర్థులందరికి సోమవారం జిల్లా పోలీస్ ట్రైనింగ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీస్ అధికారుల సమక్షంలో సిబ్బందితో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ అభ్యర్థులతో మాట్లాడుతూ పోలీసుసేవలో చేరబోయే ప్రతి అభ్యర్థి క్రమశిక్షణ, నిజాయితీ, కఠిన కృషిని తమ జీవిత సూత్రాలుగా చేసుకోవాలని సూచించారు. ప్రజలకు సేవ చేయడం ఒక గొప్ప అవకాశమని, సమాజ భద్రత కోసం ప్రతి కానిస్టేబుల్ తన వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపికైన అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ రాబోయే శిక్షణలో పూర్తి నిబద్ధతతో ముందుకు సాగాలని ఎస్పీ ప్రోత్సహించారు. జిల్లాలో మొత్తం 310 మంది అభ్యర్థులు వెరిఫికేషన్ ప్రక్రియకు హాజరవ్వాల్సి ఉండగా 296 మంది అభ్యర్థులు సోమవారం హాజరయ్యారు. 14 మంది అభ్యర్థులు ఈ సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు హాజరు కాలేదు. సివిల్ 263 మందికి గాను 250 మంది, ఏఆర్ 47 మందికి గాను 46 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థుల విద్యార్హతలు, క్రీడా సర్టిఫికేట్లు, కేటగిరీకి సంబంధించిన ధ్రువపత్రాలు సహా అన్ని అవసరమైన పత్రాలను సక్రమంగా పరిశీలించడం జరిగింది. వెరిఫికేషన్‌లో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్ఆర్.రాజశేఖర్‌రాజు, ఏఆర్. అడిషనల్ ఎస్పీ శివానంద కిషోర్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఆర్ఐ చంద్రశేఖర్, పోలీస్ కార్యాలయ ఏఓ నాగభూషణమ్మ పాల్గొన్నారు.

అభ్యర్థుల సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు

నిమజ్జనానికి పక్కాగా ఏర్పాట్లు : కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వినాయక నిమజ్జనానికి కట్టమంచి చెరువు కట్ట వద్ద ఏర్పాట్లు వేగంగా, పక్కాగా చేపట్టాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డితో కలిసి చెరువు కట్ట వద్ద చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. వినాయక నిమజ్జనం సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన ఏర్పాట్లు, ఉద్యోగులు, సిబ్బంది కేటాయింపు, విధుల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన మేర నీటిని, ప్రత్యేక వేదికను సిద్ధం చేయాలన్నారు. బారికేట్ల నిర్మాణం, లైటింగ్, నీటి సరఫరా, మొబైల్ టాయిలెట్ల ఏర్పాట్లపై చర్చించారు. పెద్దవిగ్రహాలను నిమజ్జనం చేయడానికి క్రేన్లు అందుబాటులో ఉంచాలన్నారు. చెరువు కట్ట వద్ద చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. నిమజ్జనం సజావుగా, విజయవంతంగా సాగేందుకు వీలుగా ప్రజారోగ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగం నుంచి అధికారులు, సిబ్బంది కేటాయింపు, విధులు నిర్వహణ పూర్తి చేయాలన్నారు. మొబైల్ టాయిలెట్లను అందుబాటులోకి తేవాలని, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ శ్రావణి, శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి- శాంతిపురం : శాంతిపురంలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో శాంతిపురంలో రూ.65లక్షలతో అన్న క్యాంటీన్ నిర్మిస్తున్నట్టు తెలిపారు. పేదలకు, రోజువారి కూలీలకు ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందించాలని పేదవాడి ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో అన్న క్యాంటీన్లను నిర్వీర్యం చేసి పేదవాడి కడుపు కొట్టారని అన్నారు. ఇప్పటి వరకు పట్టణాలకు, జిల్లా కేంద్రాలకు పరిమితమైన అన్న క్యాంటీన్లను మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలన్న సదుద్దేశంతో అన్న క్యాంటీన్ నిర్మాణం చేస్తున్నట్టు తెలిపారు. కుప్పం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ఆశయమన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మణిరత్నం, హుడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, టీటీడీ బోర్డు డైరెక్టర్ వైద్యం శాంతారాం, విశ్వనాథ్ నాయుడు, ఉదయ్ కుమార్, విజయ రామిరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని టి పుత్తూరులో పశుసంవర్ధక శాఖ పశుగ్రామీణ అభివృద్ధి సంస్థ (రాష్ట్రీయ గోకుల్ మిషన్) ఆధ్వర్యంలో సోమవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సంచాలకులు డాక్టర్ మహ్మద్ ఆరిఫ్ లేగదూడల్లో పోషణ, పెరుగుదల, వ్యాధులకి సంబంధించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 130 లేగ దూడలను ప్రదర్శించారు. ఈ దూడల్లో మూడు దూడల్ని ఉత్తమ దూడలుగా ఎంపిక చేశారు. ఈ దూడలకు సంబంధించిన రైతు లకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో టి పుత్తూరు సర్పంచ్ పి ఎం రవిచంద్రారెడ్డి, ఉపసంచాలకులు డాక్టర్ వాసు, పశు గణాభివృద్ధి సంస్థ డాక్టర్ సుబ్బారావు, తవణంపల్లి మండలం పశు వైద్యాధికారులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ పిన్నాకి పాషా, డాక్టర్ లావణ్య, డాక్టర్ యోగానంద్, పశువైద్య సిబ్బంది గోపాలమిత్రలు తులసి, చంద్రశేఖర్, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మీయ వీడ్కోలు సమావేశం

మాట్లాడుతున్న ఎంపిడివో ధనలక్ష్మి

ప్రజాశక్తి -ఐరాల: ఐరాల ఆసుపత్రిలో ట్రాన్స్‌ఫర్ అయిన ఏఎన్ఎం లకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ రెడ్డప్ప నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో ధనలక్ష్మి విచ్చేశారు. న్యూ బాన్ క్యారీ యూనిట్ బ్రెస్ట్ ఫీడింగ్ రూమ్, రిఫ్రిజిరేటర్ ప్రారంభో త్సవరం ఎంపిడివో చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య సిబ్బంది సచి వాలయంలోని ఇతర సిబ్బందితో సహకరిస్తూ కలసికట్టుగా కృషి చేసి ఆరోగ్యవంత సమాజాన్ని తీర్చిదిద్దే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. వాకింగ్ ఏరియాను, బోరు పైప్ లైన్ డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను త్వరలో ఏర్పాటు చేస్తామని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లను తక్షణమే చేపడతామని హామీ ఇచ్చారు. ఏఎన్ఎమ్స్ ఉద్దేశించి మాట్లాడు తూ ఇక్కడ అందించిన సేవలు మరపురానివని కొత్త మండలం లోనూ కొత్త ఉత్సాహంతో పని చేస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని పిలుపునిచ్చారు. వైద్యాధికారి డాక్టర్ రెడ్డప్ప మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో అందరూ కలిసికట్టుగా పని చేస్తేనే సరైన వైద్యం అందించ వచ్చున్నారు. వీడ్కోలు సభకు విచ్చేసిన ఏఎన్ఎంలను సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో ఐరాల ఆసుపత్రి వైద్య సిబ్బంది, సూపజరు, స్టాఫ్, ఏఎన్ఎంలు, ఎంఎల్ హెచ్‌పిలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణా జలాలకు హారతి పడుతున్న టిడిపి నాయకులు

కృష్ణా జలాలకు హారతి

ప్రజాశక్తి -గుడిపల్లి: గుడిపల్లి మండలంలో కృష్ణా జలాలకు టిడిపి మండల అధ్యక్షులు టిఎం బాబు నాయుడు ఆధ్వర్యంలో సోమవారం తెలుగు తమ్ముళ్లు హారతులు పట్టి పూజలు నిర్వహించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 750 కిలోమీటర్ల మేర హంద్రీ-నీవా కాలువ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం ప్రజలపై ఉన్న ప్రేమ అభిమానాలతో అపర భగీరధుడిలా ఇక్కడికి సాగు, తాగు నీటి సమస్యను పరిష్కరించడానికి ఎంతో శ్రమ పడి నీటిని తెప్పించారన్నారు. కరువు ప్రాంతమైన ఈ ప్రాంతానికి సాగు, తాగు నీరు అందించడంతో గుడుపల్లి మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్, మాజీ జెడ్పిటిసి బేటప్ప నాయుడు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ మునిరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్ష: సీఐ

ప్రజాశక్తి- విజయపురం (నగరి): విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని సీఐ విక్రమ్ హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ర్యాగింగ్ వ్యతిరేక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ చట్టవిరుద్ధమని, ర్యాగింగ్‌కి పాల్పడితే చాలా కఠినమైన శిక్షలు ఉంటాయని, నిందితుడు తాను ర్యాగింగ్ చేయలేదన్న విషయాన్ని సాక్ష్యాధారాలతో సహా తనకు తానే నిరూపించుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రాసిక్యూషన్ సైతం ఈ విషయంలో బాధ్యత తీసుకోదన్నారు. అంతేగాక ర్యాగింగ్ కళాశాల ఆవరణలో మాత్రమే కాదని కళాశాలకు వచ్చే దారిలోను, వసతి గృహాల్లోనూ ఎక్కడైనా ర్యాగింగ్ చేసిన వాళ్లు నేరస్తులే అని విద్యార్థులకు వివరించారు. ఎస్ఐ తేజస్విని మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో, వాట్సాప్ డీపీలుగా తమ ఫొటోలను ఉంచుకో కూడదన్నారు. మహిళా సాధికారతకు సంబంధించిన అవగా హనను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఆఫీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి- రామకుప్పం: మండల కేంద్రమైన రామకుప్పం దిగువ వీధిలోని గంగమాంబ ఆలయంలో సోమవారం కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేకంతో పాటు, కలశ స్థాపన, చండి మహా యాగం చేపట్టారు. అనంతరం పెద్దఎత్తున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానికులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పాల్గొని పూజలు నిర్వహించారు.

విజయకాంత్‌కు ఘననివాళి

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : నటుడు, డీఎండీకే వ్యవస్థాపకులైన విజయకాంత్ 72వ జయంతి వేడుకలను ఆయన అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ పుదుపేటలో ఆయన చిత్రపటానికి ప్రత్యేకపూజలు చేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. పలువురు పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టరు వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు వినాయక చవితి వేడుకలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని డాక్టరు వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినాయక చవితి వేడుకలను బోటనీ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోటనీ అధ్యాపకబృందం డా ఎల్ఎన్‌డి భక్షు, డాక్టరు సి అరుణ పర్యవేక్షణలో విద్యార్థులు పత్రి పూజలో ఉపయోగించే ఔషధ మొక్కల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. విద్యార్థులు వివిధ ఆకుల ఔషధ గుణాలను వివరించి, భారతీయ సంస్కృతిలోని వైజ్ఞానికతను ప్రతిపాదించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా బి అన్నపూర్ణ శారద మాట్లాడుతూ 'ఇలాంటి భారతీయ సాంస్కృతిక సంప్రదాయాలు పర్యావరణ రక్షణతోపాటు ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగపడతాయి' అని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు బిఎల్‌పి లత, ఐక్యూ ఏసీ సమన్వయకర్త డాక్టరు పి వెంకటేశు, ఇతర బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచని సర్కారు తోపు

- విశ్రాంతి స్థలంగా ఉపయోగపడే అవకాశం
- పర్యవేక్షణ కరువు
- స్పందించని అధికారులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలో ఐదు ఎకరాల మేర వున్న సర్కారు తోపును అభివృద్ధి చేస్తే వివిధ రకాల చెట్లు పండి ఫలాలు ఇవ్వడంతో పాటు ప్రజలకు విశ్రాంతి స్థలంగా మారే అవకాశం వుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు దీనిపై స్పందించాల్సిన అవసరం వుంది. దీనికి తోడు గ్రామీణ ప్రాంతా ల్లో అటవీ ప్రాంత భూములు సైతం ఆక్రమణలో వున్నాయని ఫారెస్టు అధికారులు వాటిని స్వాధీనం చేసుకుని చెట్లు పెంచితే భవిష్యత్ తరాలకు మంచి అటవీ సంపదను ఇచ్చే అవకాశం వుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

అభివృద్ధికి నోచని సర్కారు తోపు

మండల కేంద్రంలోని సర్కారు తోపు సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో విస్తరించారు. ఈ తోపులో చింత చెట్లు, కర్పూరం చెట్లు, వేప చెట్లు పెరిగాయి. ఈ ప్రదేశం మండల ప్రజలకు విశ్రాంతి స్థలంగా (పార్కు)గా మారే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

మండలం అభివృద్ధి చెందుతున్న ఈ దశలో, ఈ సర్కారు తోపును పార్కు లాగా రూపకల్పన చేస్తే ప్రజలకు సేదతీరడానికి అనువుగా ఉంటుందని అభిప్రాయాలు విని పిస్తున్నాయి. అంతే కాక, ఈ ప్రదేశాన్ని అభివృద్ధి చేస్తే భూ ఆక్రమణలు కూడా నివారించవచ్చని స్థానికులు సూచిస్తున్నారు.

పర్యవేక్షణ కరువు

మండల పరిధిలోని అనేక గ్రామాల్లో అటవీ శాఖకు చెందిన భూములు, చెట్లు ఉన్నప్పటికీ, తగిన పర్యవేక్షణ లేక పోవడం వల్ల కొన్నిచోట్ల చెట్లను అక్రమంగా నరికి వేస్తున్నారని సమాచారం. ఒకానొక సమయంలో ఈ భూములు ఎక్కడ ఉన్నాయో కూడా ఆ శాఖ అధికారులకు స్పష్టత లేని పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. ప్రజల అభిప్రాయం ప్రకారం, సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఈ భూములను గుర్తించి, సర్వే చేయించి, తమ ఆధీనంలో ఉంచుకుని, కొత్త చెట్లను నాటి అభివృద్ధి చేస్తే రాబోయే రోజుల్లో అటవీ సంపద పెరిగే అవకాశముంది.

భూములు పరిరక్షించాలి

మండల పరిధిలోని కమ్మనపల్లి, బేలుపల్లి, మరిమానుచేన్లు, ధర్మపురి, మేకల నాగిరెడ్డిపల్లి, దేవదొడ్డి, కైగల్ తీర్థం, నెల్లిపట్ల వంటి గ్రామ పరిసరాల్లో అటవీ శాఖ భూములు విస్తరించి ఉన్నప్పటికీ, వాటిలో చాలా అన్యాక్రాంతంలో ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. కొందరు వ్యక్తులు వాటిని స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో, అటవీ శాఖ అధికారులు చొరవ చూపి ఆక్రమిత భూములను తిరిగి స్వాధీనం చేసుకుని, చెట్లు నాటి అభివృద్ధి చేస్తే భవిష్యత్ తరాలకు అమూల్యమైన అటవీ సంపద లభిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధికి నోచుకోని సర్కారు తోపు

బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి -కార్వేటినగరం : మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కెఎం పురంలో పని చేస్తూ ఉద్యోగో న్నతిపై బదిలీ అయిన ఉపాధ్యా యులకు పాఠశాల హెచ్ఎం డి సునీత సోమవారం సన్మానించారు. పాఠశాలలో పి చంద్రశేఖర్ నాగలాపురం మండలంలో హెచ్ఎంగా బదిలీపై వెళ్లారు. ఎం.రవి, దామోదరం, ఖరీమ్, భాస్కర్, మహమ్మద్ షారుక్, త్యాగరాజు, పట్టాభిలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యం ప్రదర్శించి ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమా లు విద్యార్థులను ఎంతో ఆకట్టుకుంది. హెచ్ఎం డి సునీత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి ఎదగవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది, శానిటరీ సిబ్బంది

దుకాణాల్లో విస్తృత దాడులు

ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించాలి

ప్రజాశక్తి -పుంగనూరు: మున్సిపల్ శానిటరీ సిబ్బంది పట్టణంలో పలు దుకాణాల్లో సోమవారం విస్తృత దాడులు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి ఆదేశాల వరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో సోమవారం పలు దుకాణాల్లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో ప్లాస్టిక్ వాడకం రోజురోజుకూ పెరుగుతోందని వీటిని నిరోధించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందన్నారు. పట్టణ ప్రజలు ప్లాస్టిక్‌కు స్వస్తి పలికి నార బ్యాగులను ఉప యోగించాలన్నారు. ఇకపై ప్రతి వారం తమ సిబ్బంది పట్టణంలోని అన్ని దుకాణాల్లో తనిఖీలు చేస్తారన్నారు. నిబంధనలను అతిక్రమించి ప్లాస్టిక్ అమ్మకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వస్త్రం, జనపనార బ్యాగులు మాత్రం ఉపయోగంలోకి తేవాలన్నారు.

చెత్త నుండి సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి -కార్వేటినగరం : మండల పరిధిలోని డిఎం పురం గ్రామ పంచాయతీలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి శ్రీరంగం గోపి, ఎంఆర్‌సి ఏకాంబరం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సేంద్రియ ఎరువును తయారీ చేస్తున్న వాటిని పరిశీలిం చారు. ప్రతిరోజూ సేకరించిన తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న తొట్టెలను పరిశీలించి రైతులకు వర్మి కంపోస్ట్ కేజి పది రూపాయలకే విక్రయిస్తామన్నారు. నెలకు 200 కేజీలు అమ్మి వాటి ద్వారా వచ్చిన ధనాన్ని పంచాయతీకి ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చిత్తూరు జిల్లా జూనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-కుప్పం : చిత్తూరు జిల్లా జూనియర్ షూటింగ్ బాల్ జూనియర్ బాల బాలికల జట్లను ఎంపిక చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సెలక్షన్ కు చిత్తూరు జిల్లా నలుమూలల నుండి 100 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలను సాధించాలని చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఛైర్మన్ మహేష్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

ఎస్ఆర్ పురం: మండలంలోని గంగమ్మ గుడి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వీ రేష్మ , టి రక్షిత , యంఆకాష్ రామకుప్పం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన షూటింగ్ బాల్ జిల్లా స్థాయి జూనియర్స్ బాల, బాలికల విభాగంలో అత్యంత అద్భుతంగా రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు సెప్టెంబర్ 13 ,14న నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి టోర్న మెంటులో పాల్గొంటారు. ప్రత్యేక శిక్షణను ఇచ్చిన వ్యాయామదర్శకుడు ఏం లోకనాథంను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం ,విద్యార్థులు ,కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల విశేష ప్రతిభ

ప్రజాశక్తి-పలమనేరు: దేశవ్యాప్తంగా 15 చోట్ల సోమవారం నిర్వహించిన సీఏ కాన్వకేషన్‌లో బెంగళూరు, వసంత్ నగర్, అంబేద్కర్ భవన్లో, పలమనేరుకు చెందిన, రిషబ్, శశి శ్రీనివాస్ సీఏ కాన్వకేషన్ సర్టిఫికెట్స్ మెడల్స్ పొందారు. వీరిద్దరూ సిఏ, సీఎంఏలో ఆరు నేషనల్ ర్యాంకులు, ఇంటర్లో స్టేట్ ర్యాంకులు, పదవ తరగతిలో ఆలిండియా ర్యాంకులు సాధించారు. మంచి కం కంపెనీలలో, మంచి ప్యాకేజీతో, సెలెక్ట్ అయిన విషయం విదితమే. రాష్ట్రపతి వద్ద ఇద్దరు అవార్డులు పొందారు. పలమనేరు పేరును జాతీయ స్థాయిలో తీసుకెళ్లిన ఇద్దరు విద్యార్థులను శ్రేయోభిలాషులు, స్నేహితులు ప్రోత్సహించి అభినందించారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

- సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -వి కోట : పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఇందుకు పంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించు కోవడానికి పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు గిరిధర్ గుప్తా పిలుపు నిచ్చారు. పదవ జిల్లా మహాసభలు వి కోటలో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ చిత్తూరు జిల్లా అధ్యక్షు లుగా బి మధు (బంగారుపాలెం), ఉపాధ్యక్షు లుగా వెంకటరమణ (పుంగనూరు), సంపూర్ణమ్మ (గంగవరం), ప్రధాన కార్యదర్శిగా గోవిందప్ప (వి కోట), కార్యదర్శిగా వెంకటమణి (కల్లూరు), కార్యదర్శిగా కృష్ణ (వి కోట), కోశాధికారిగా పి మల్లయ్య (గంగవరం)ను ఎన్నుకున్నారు. వీరితో పాటు 12 మందితో కమిటీ సభ్యులను ఏక గ్రీవంగాఎన్నుకున్నారు.

మూడు టీచర్ పోస్టులకు మురళి మోహన్ ఎంపిక

ప్రజాశక్తి -పుంగనూరు: ఎస్‌వి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ తెలుగు అధ్యాపకునిగా పనిచేస్తున్న పి మురళీమోహన్ మూడు పోస్టులకు ఎంపికైనట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చౌడేపల్లి మండలం ఎ కొత్తకోట కు చెందిన పి గంగిరెడ్డి కుమారుడు పి మురళి మోహన్ డీఎస్సీ2025 లో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాయని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 78.07 మార్కులతో 16వ ర్యాంకు, పిజిటి లో 77.5 మార్కులతో రాయలసీమ జోన్‌లో 20 వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. టిజిటిలో 72.20 మార్కులు సాధించారు. ఈ విజయం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ విజయానికి తోడ్పడిన గురువు లకు, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

వికలాంగులకు వినికిడి, నడక కర్రలు పంపిణీ

వికలాంగులకు వినికిడి, నడక కర్రలు పంపిణీ చేస్తున్న ఏడీ బి వినోద్

ప్రజాశక్తి -పుంగనూరు: నియోజకవర్గంలోని వికలాంగులకు త్రిచక్ర బ్యాటరీ సైకిల్, వినికిడి, నడక కర్రలను పంపిణీ చేశామని ఆ శాఖ ఏడీ బి వినోద్ తెలిపారు. జిల్లా విభిన్నంగా వున్న వారు, వయోవృద్ధుల సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో పుంగనూరు బసవరాజు స్కూల్ ఆవరణలో సోమవారం వికలాంగులకు వాహనాలు పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించి వికలాంగులకు వారికి అవసరమైన పరికరాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. రూ.56 లక్షలు విలువ చేసే 1240 వివిధ రకాల పరికరాలను అందించామన్నారు. వారివారి సమస్యలకు పరిష్కారంగా పరికరాలు అందించామన్నారు. భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఇండియా, తమ శాఖతో సంయుక్తంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి..

- విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలి
- ఎంఈఓ విజయకుమారి

పాఠశాల విద్యార్థులను పరిశీలిస్తున్న ఎంఈవో విజయకుమారి

పజాశక్తి-సోమల: ఉపాధ్యాయులు సమయపాలన పాటించి సకాలంలో పాఠశాలకు చేరుకుని విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈఓ విజయకుమారి అన్నారు. నంజంపేట సరస్వతీపురం పాఠశాలలను ఆమె సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులలో దాగివున్న సామర్థ్యాలను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు వెనకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారిపై దృష్టి సారించి బోధించాలని సూచించారు. పలువురు విద్యార్థులను ప్రశ్నించి వారి వద్ద నుండి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మరింత రుచికరంగా విద్యార్థులకు వండి పెట్టాలని ఆదేశించారు. రికార్డులను పరిశీలించి ఇటీవల పరీక్షలలో విద్యార్థులు పొందిన మార్కులను అసెస్మెంట్ రికార్డులలో పొందు పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధాంతరంగా ముగిసిన మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రజాప్రతినిధులు, అధికారులు మండల అభివృద్ధికి చేసిన, చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఎలాంటి చర్చలు లేకుండానే సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డప్ప అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో తాను దళితుడని అవమానించి స్థానికంగా ఉన్న కొందరు తనపై తప్పుడు నివేదికలు అందించి వైసిపి నుంచి తనని సస్పెండ్ చేయడం చాలా బాధ కలిగించిన విషయమై సభను ముగిస్తున్నట్లు ఎంపీపీ రెడ్డప్ప ప్రకటించారు. దీంతో పెద్దపంజాణి మండల సర్వసభ్య సమావేశం ఎలాంటి ప్రగతి నివేదికలు, ఎలాంటి చర్చలకు తావు లేకుండా అర్ధాంతరంగా ముగిసింది. సభ ప్రారంభమైన వెంటనే వైసీపీ ఎంపీటీసీలు ఒక కోటి ఒక లక్ష రూపాయలు విలువ చేసే పనులు ఎంపీటీసీల అనుమతులు లేకుండానే పనులు జరిపించారని దీనికి సరైన సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. అనంతరం వీరప్పల్లి ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైసిపి హయాంలో ఏకైక టిడిపి ఎంపీటీసీగా ఉన్న తనను అవమానించారని ఇప్పుడు మాత్రం వైసీపీ ఎంపీటీసీలు సభా మర్యాదలు, ప్రోటోకాల్ గురించి మాట్లాడడం విడ్డూరంగా వుందన్నారు. సమావేశం అర్ధాంతరంగా ముగిసిన వెంటనే వైసీపీ ఎంపీటీసీలు,ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా బైటాయించి నిరసన తెలిపారు. అనంతరం సభలో ఎంపీపీ రెడ్డప్ప, డిప్యూటీ ఎంపీడీవో శారదా దేవి మాట్లాడుతూ 99 లక్షల ఇరవై రెండు వేల రూపాయలతో మండలంలో 47 పనులకు 42 పనులు పూర్తి చేశామని ఐదు పనులను ఇంకా మొదలు పెట్టలేదని విలేకరులకు తెలిపారు. పూర్తిగా ఎంపీటీసీల ఎజెండా ఆమోదంతో అభివృద్ధి పనులను చేసినట్లు డిప్యూటీ ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ సమావేశంలో తహశీల్దారు హనుమంతు,పెద్దపంజాణి వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు శ్రీరాములు, జెడ్పిటిసి సుష్మ కీర్తి, ఎస్పై ధనుంజయ రెడ్డి,అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి నాయకులు

డీఎస్‌సీలో కుట్టి స్టడీ సర్కిల్ అభ్యర్థుల సత్తా



ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: స్థానిక మిట్టూరులో నిర్వహిస్తున్న కుట్టి స్టడీసర్కిల్‌లో 2025 డీఎస్‌సీ సాంఘిక సంక్షేమశాఖ, మైనార్టీశాఖ ఆర్థిక సాయంతో తమ కుట్టిస్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు 150 మంది ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారని కరెస్పాండెంట్ పవన కుమారి, డైరెక్టర్ రామకృష్ణ తెలిపారు. స్కూల్ అసిసెంట్‌లో సయ్యద్ సబినా రహ్మాన్ ఉనిసా జిల్లా మొదటి ర్యాంకు సాధించారు. ఎస్ఐ బైయాలజి లో జిల్లా ఏడు ర్యాంకులు, జిల్లా స్థాయిలో 11వ ర్యాంకు ఎన్ ఉష సాధించారు. ఎస్ఎ ఇంగ్లీష్‌లో సి గాయత్రి 57వ ర్యాంకు, ఎస్ఎ సోషియల్‌లో పూర్ణిమ 44వ ర్యాంకు , టి శరణ్య 109 ర్యాంకు సాధించగా ఎస్‌జీటి జిల్లా ఎస్సీ క్యాటగిరిలో జిల్లా మొదటి స్థానం రమేష సాధించారు. ఎస్టీ క్యాటరిగిలో జిల్లా మూడోర్యాంకు చోటప్రశాంత్, ఎస్‌జిటి ఉర్దు విభాగంలో రఫియా అనతపురం రెండవ ర్యాంకు, అయిషా భాను 4 ర్యాంకు, కడప 14వ ర్యాంకు కరీమ్‌భాషా కుట్టి స్టడీసర్కల్ నందు శిక్షణ పొందిన అభ్యర్థులు సాధించారు. కడప 22వ ర్యాంకు అఫ్రిన్‌భాను , ఎస్ఎ ఇంగ్లీష్ కర్నూల్ హసీనా 92 ర్యాంకు సాధించారు. కుట్టి స్టడీసర్కల్ నందు 2025 డిస్సీలో శిక్షణ పొందిన అభ్యర్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల కరెస్పాండ్, డైరెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. తమ స్టడీ సర్కిల్‌లో కానిస్టేబుల్, టెట్, డిఎస్సీ, ఆర్ఆర్‌బి, ఐబిపిఎస్, గ్రూప్ -2, సైనిక, నవోదయ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. స్కూల్ అసిసెంట్ల విభాగంలో 40 మందిలో ఎస్‌జీటి 27, స్కూల్ అసిస్టెంట్లు 13, మైనార్టీ కేటగిరిలో 26 మంది లో ఎస్‌జీటిలు 13, స్కూల్ అసిసెంట్లు 8 మంది సాధించారన్నారు.

క్రైం న్యూస్

గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరు అరెస్ట్

ఒకటిన్నర కేజీ గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి ఒకటిన్నర కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ నెట్టికంటయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గంజాయి రవాణాపై తమకు అందిన సమాచారం మేరకు చిత్తూరుకు చెందిన గణేష్, లోకేష్‌లను చెన్నై-బెంగళూరు రోడ్డు శృతి మిల్క్ ఫ్యాక్టరీ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి వద్దనుండి ఒకటిన్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఏ వన్ నిందితుడు హేమంత్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. ఏవన్ నిందితుడిని త్వరలో అరెస్ట్ చేయనున్నట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలపాలని కోరారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురు అరెస్ట్

500 గ్రాముల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : మండలంలోని తడుకు పేట గ్రామం తిరుపతి-చెన్నై హైవేకి ఆనుకొని వున్న మిక్సింగ్ ప్లాంట్ వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులకు అదుపులోకి తీసుకున్నారు. సీఐ విక్రమ్ కథనం మేరకు.. గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు ముందస్తుగా అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం ఎస్ఐ విజయ్‌నాయక్, ట్రైనీ ఎస్ఐ తేజస్విని పోలీసులు, డిప్యూటీ తహశీల్దారు మేఘవర్ణంలతో పాటు సీఐ తడుకుపేట గ్రామంలోని మిక్సింగ్ ప్లాంటు వద్దకు చేరుకున్నారు. తమిళనాడు రాష్ట్రం, చెన్నై ఆవడికి చెందిన వెంకటేష్ , డికమలేష్ అనే యువకులు తమకు ముందస్తు పరిచయం ఉన్న నగరి తడుకుపేట ఎస్టీ కాలనీకి చెందిన ఉదయ్ కిరణ్ , దేవేంద్ర వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేస్తుండగా వారిని అక్కడే అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి సుమారు 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి గంజాయి ఎక్కడ నుండి తీసుకొచ్చారని విచారణ చేపట్టారు. వారిని పట్టుకునేందుకు కృషి చేసిన సత్య, గజేంద్ర, కదిరివేలు, గోపి, లోకనాథం, రవి, సురేష్, రమేశ్‌లను అభినందించారు.

దోపిడీ దొంగ అరెస్టు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రైలు దోపిడీ దొంగను రైల్వే పోలీసులు సోమవారం అరెస్టు చేసి అతని వద్ద నుండి 5లక్షల76 వేల రూపాయలు విలువ చేసే 64 గ్రాముల బంగారు అభరణాలను చిస్వాధీనం చేసుకున్నారు. ఈనెల 6 వ తేదీ తిరుపతి నుండి మదనపల్లి కి వెళ్లే తిరుపతి- మదనపల్లి సమ్మర్ స్పెషల్ రైల్లో ప్రయాణిస్తున్న తిరుపతికి చెందిన జి కవిత, చెంచు బాలాజీపై ఇద్దరు గుర్తుతెలియని దొంగలు కత్తితో దాడి చేసి ఆమెను గాయ పరిచి, ఆమె మెడలోని బంగారు మంగళసూత్రం, చైనును లాక్కెళ్లారు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు సిసి పుటేజీల ఆధారంగా దొంగను కనుగొన్నారు. మరో వ్యక్తి పరారీలో వున్నాడని అతడిని కూడా పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

గుడి స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ గట్టువారి పల్లె సమీపంలోని అక్కదేవతల గుడికి సంబంధించిన అర్ధ ఎకరాకు పైగా స్థలం ఆక్రమణకు గురైందని పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు, భక్తులు తహశీల్దారు మధుసూదన్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. దాదాపు 500 సంవత్సరాల నుండి అక్కదేవతల గుడి ప్రభుత్వ పోరంబోకు స్థలంలో ఉందని ప్రతి ఏడాది అక్కదేవతల పచ్చ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారని, ఈ స్థలంలో ఓ వ్యక్తి ఆలయ స్థలాన్ని ఆక్రమించి గోకులం షెడ్డు నిర్మించాడని దీనిపై గత ఏడాది నవంబరులో కలెక్టరుకు వివరించామని, పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 120 మంది సంతకాలు చేసి అర్జీలు ఇచ్చామని కొరవోని కాలువ పెద్ద కాలువ పూడ్చివేసి ఆక్రమణకు పాల్పడ్డారని తమకు న్యాయం చేయాలని కోరామని తెలిపారు. తహశీల్దారు మధుసూదన్ సాయంత్రం ఆ స్థలానికి చేరుకుని ఆక్రమణ స్థలాన్ని దేవాలయానికి చెందేలా కృషి చేశారు.

శ్రీరాములుకు నివాళి

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని ఎస్ గొల్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త శ్రీరాములు అనారోగ్యంతో సోమవారం మరణించాడు. విషయం తెలుసు కున్న టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, మాజీ సర్పంచ్ గంట్లప్ప గౌడు, చంద్ర రెడ్డి, గజేంద్ర, రమణ, పరుశురాం, మాజీ ఎంపిటిసి శ్రీనివాసులు గౌడ్ తదితరులు శ్రీరాములు మృతదేహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. మృతుని కుటుంబసభ్యులకు తమ సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియలకు పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): పూతలపట్టు నియోజకవర్గం, తవణంపల్లె మండలం నల్లిశెట్టిపల్లె పంచాయతీకి చెందిన సుజాతకు సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే మురళీమోహన్ అందించారు. నల్లిశెట్టిపల్లె పంచాయతీకి చెందిన లబ్ధిదారులు సుజాత, ఆమె కుమార్తె మౌనికకు మంజూరైన సిఎం సహాయ నిధి రూ. 1,85,087 చెక్కును ఎమ్మెల్యే అందించారు. ప్రేమలతకు సైతం చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లి మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM-1st ADDL. DISTRICT JUDGE AT MAHABUBNAGAR

M.V.O.P No.83 of 2019

Between
R.Sravani minor Reptd by N/G
R.Jagadishwar ...Petitioner
And
Mrs.Hemalatha Katari and another ...Respondents

NOTICE

To.
1.Mrs.Hemalatha Katari Anil,
W/o.K.M.Anil Kumar, age 35 yrs,
Occ; Owner of the Lorry bearing
No.AP03TC 7479, R/o.H.No.1-39,
Peddakalva, Yellamarajupalle,
GD Nellore, Chitoor Dist, A.P.

The above name claim Petitioner filed Motor Accidents case against you and the same has been posted on 03-09-2025 for your appearance in the Hon'ble 1st Addl. District Judge at Mahabubnagar, if you failed appear before the above court on 03-09-2025 **at 10-30 A.M.,** the case will be decided on exparty.

(By Order of the Court)

V.Veera Brahma Chary, B.Sc., B.L.
Advocate, Mahabubnagar.

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM-1st ADDL. DISTRICT JUDGE AT MAHABUBNAGAR

M.V.O.P.No.114 of 2019

Between
R.Jagadeshwar ...Petitioner
And
Mrs.Hemalatha Katari and another ...Respondents

NOTICE

To.
1.Mrs.Hemalatha Katari Anil,
W/o.K.M.Anil Kumar, age 35 yrs,
Occ; Owner of the Lorry bearing
No.AP03TC 7479, R/o.H.No.1-39,
Peddakalva, Yellamarajupalle,
GD Nellore, Chitoor Dist, A.P.
2.T.E.Srinivas, S/o.Erapa, age 39 Yrs,
Occ; Driver of the Lorry No.AP03 TC 7479,
R/o.Thammalapalli Vg, Rayalpad Po,
Srinivasapura Tq, Kolar Dist,
Karnataka State.

The above name claim Petitioner filed Motor Accidents case against you and the same has been posted on 03-09-2025 for your appearance in the Hon'ble 1st Addl. District Judge at Mahabubnagar, if you failed appear before the above court on 03-09-2025 **at 10-30 A.M.,** the case will be decided on exparty.

(By Order of the Court)

V.Veera Brahma Chary, B.Sc., B.L.
Advocate, Mahabubnagar.